గుంతల రోడ్డుపై వెళ్లేదెలా?

- అధ్వానంగా మారిన ఎల్లారెడ్డి–కల్యాణి గ్రామ రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు





గుంతలమయమైన కల్యాణి గ్రామానికి వెళ్లే రోడ్డు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల కేంద్రం నుంచి కల్యాణి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు రోడ్లపై ఉన్న గుంతల్లో నిలిచి ఉండడంతో వాహనదారులు గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలో పడి ఇబ్బందులకు గురవుతున్నారని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అయినా సమస్యను అధికారులెవరూ పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లారెడ్డి నుంచి కల్యాణి గ్రామానికి వెళ్లే దారిలో పట్టణంలోని లింగారెడ్డిపేట తండా, బీడీ కాలనీ, హరిజనవాడ శివారులలో రోడ్డు గుంతలుగా ఉండడంతో కొంతమంది వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలలో నీళ్లు నిండి అవి మరింత పెద్దవిగా మారాయని, దీంతో గుంతలలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా ఆటోలు తరచు చెడిపోతున్నాయని, దీనివలన కష్టపడి సంపాదించిన డబ్బులు ఆటోల రిపేర్లకు పెట్టాల్సి వస్తుందని ఆటోవాలాలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి..

రోడ్లపై ఏర్పడిన గుంతలకు అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలి. దీనివలన వాహనదారులు గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– రామకృష్ణ, లింగారెడ్డిపేట

అధికారులు స్పందించాలి

ఎల్లారెడ్డి నుంచి కల్యాణి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. గుంతల కారణంగా ఆటోలు చెడిపోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– శ్రీనివాస్, కళ్యాణి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



గంప గోవర్ధన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దోమకొండ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజలలో కాంగ్రెస్ పార్టీపై పూర్తిగా వ్యతిరేకత ఏర్పడిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అన్ని చోట్ల విజయం సాధించాలని, అందుకు పార్టీ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షులు గంధ్ర మధుసూదన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, మాజీ ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు పాలకుర్తి శేఖర్,దోమకొండ పట్టణ పార్టీ అధ్యక్షులు బోరెడ్డి కిషన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆశంశెట్టి పోచయ్య, మాజీ ఎంపీటీసీ బోరెడ్డి నాగరాజు రెడ్డి, నాయకులు కానుగంటి నాగరాజు, బొమ్మెర గంగాధర్, బొబ్బసాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి భూమిని కాపాడండి



మాచారెడ్డి: కబ్జాకు గురైన తమ భూమిని కాపాడాలని మండల కేంద్రానికి చెందిన సిరిగాద నర్సాగౌడ్ కుటుంబసభ్యులు కోరారు. ఈమేరకు వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు చెందిన నాలుగు గుంటల భూమని రైస్‌మిల్లు యాజమాన్యం కబ్జాచేసిందని, దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారంటూ ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి భూమిని తమకు అప్పగించాలని కోరారు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సరళకు వినతిపత్రం అందజేశారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



దోమకొండ: త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు తమ సత్తా చాటాలని పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కుంట లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల మీద దృష్టిపెట్టాలన్నారు. ఎన్నికల్లో ఖచ్చితంగా గెలవాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, భూపాల్ లక్ష్మన్, కంది మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫసల్‌బీమా అమలు చేస్తే రైతులకు మేలు జరిగేది



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిఉంటే ఇటీవల వచ్చిన భారీ వరదల కారణంగా జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు కొంతమేలు చేకూరేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ మోహన్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరదలు సంభవించి పంటలు నష్టపోయిన రైతులతోపాటు ఇళ్లు కూలి నష్టపోయినవారికి ప్రభుత్వం తరపున ఎలాంటి భరోసా లభించలేదన్నారు. బాధితులకు ఎలాంటి సాయం చేయకుండా రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో తమ పార్టీ తరపున అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెడతామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హన్మాండ్లు, నాయకులు దేవిసింగ్, శ్రీకాంత్, కిషన్, సాయిలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం



లింగంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో నరేష్



మాచాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో నరేష్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని సూచించారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు. ఏపీఎం వినోద్‌కుమార్, కార్యదర్శి శ్రావణ్ కుమార్, సీసీలు గంగరాజం, మన్సూర్‌ఖాన్, గ్రామ సంఘ అధ్యక్షురాలు, వివోఏలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మాచాపూర్ గ్రామంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో ప్రకాష్, ఏపీఎం రాంనారాయణగౌడ్, మహిళా సంఘం సభ్యులు తదితరులున్నారు.

ప్రతి గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖలను ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డి: ప్రతి గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖలను ఏర్పాటు చేయాలని హిందూవాహిని నాయకులు యాదిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైశ్యభవన్‌లో సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు ప్రతి గ్రామాల వారీగా ఏర్పాటు కావాలని అన్నారు. దేశరక్షణ కోసం ప్రతి ఒక్కరు ముందుండాలని అన్నారు. నాయకులు శ్రీకాంత్ తదితరులున్నారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళి



భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో సోమవారం స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఓబన్న విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, వీడీసీ మాజీ అధ్యక్షుడు తక్కళ్ల నర్సరెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, వడ్డెర సంఘం నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలి



దోమకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



మీసాన్‌పల్లిలో శిక్షణ తరగతులకు హాజరైన పీవో, ఏపీవోలు



తాడ్వాయిలో..



లింగంపేటలో..

- పీవో, ఏపీవోలకు అధికారుల సూచన
- పలు మండలాల్లో కొనసాగిన శిక్షణ

ఎల్లారెడ్డి: ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. మండలంలోని మీసాన్‌పల్లి రైతువేదికలో సోమవారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎన్నికల విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సిబ్బందికి సూచించారు.ఎంఈవో రాజులు, పీవో, పీపీవోలు తదితరులున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో సోమవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయో లేవో ముందుగా తెలుసుకోవాలని సూచించారు. ఎంఈవో రామ స్వామి, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పాల్గొని, మాట్లాడారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎంఈవో విజయ్‌కుమార్, సిబ్బంది ఐరేని నర్సయ్య, వెంకటేశ్వర శర్మ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతుల వేదికలో సోమవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వాహపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండ జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్ గ్రామంలో అదనపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండలంలోని కొర్పోల్ గ్రామ రైతులు కోరారు. ఈమేరకు వారు సోమవారం జిల్లా వ్యవసాయశాఖ సంచాలకులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఎక్కువగా తరలిరావడంతో కొనుగోళ్ల సమయంలో రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అలాగే తీవ్ర వర్షాభావంతో రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్, లింగంపేట తహసీల్దార్, మండల వ్యవసాయాధికారికి వినతిపత్రాలు అందజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ: బీర్కూర్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకులు 'ఓటు చోర్'కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్ మాట్లాడుతూ.. ఓటు చోర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. నాయకులు బస్వరాజ్, రఘు, ఇంగు రాములు, కాంత్‌రెడ్డి, దొంతురాం కాశీరం, సందీప్, ఆరీఫ్, రఫీ, లయక్, నరసింహరావు, తోట ప్రభాకర్, మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.

తరగతి గదులను నిర్మించాలి



బాన్సువాడ: పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్‌లో గల ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు అక్బర్ అన్నారు. ఈమేరకు వారు సోమవారం సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరగతి గదుల నిర్మాణం పూర్తి కావడం లేదని, వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తమ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీవర్షాలు కురిసి వరదలు సంభవించి రైతులకు తీవ్రనష్టం వాటిల్లితే బీఆర్‌ఎస్ నాయకులు దానిని రాజకీయం చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సైతం తన స్థాయిని మరిచి రాష్ట్ర ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారని, అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మండలంలోని 14 గ్రామాల్లో 2,828ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని, బాధిత రైతులకు నష్టపరిహారం త్వరలోనే అందనుందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా యుద్ధప్రాతిపదికన నిరంతర ప్రక్రియగా రేషన్‌కార్డులను ఇస్తుందన్నారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, నాయకులు సంజీవులు, ఇమామ్, సాయాగౌడ్, షాహెద్, ప్రభుగౌడ్, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి యత్నాన్ని ఖండిస్తున్నాం

కామారెడ్డి టౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై జరిగిన మతోన్మాదుల దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయమూర్తి, న్యాయ వ్యవస్థకు భంగం కలిగించేలా దుండగులు దాడికి యత్నించడం సిగ్గుచేటన్నారు. ఈ దాడి యత్నం దేశ రాజ్యాంగంపై జరిగినట్టుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లు రామస్వామి, ఉపాధ్యక్షులుగా లైన్ రమేష్, చాకలి మోహన్, ఎల్లమ్మల సురేష్, బొమ్మని సాయిలు, ప్రధాన కార్యదర్శి చందాపురం రవిగౌడ్, క్యాషియర్‌గా దర్పస్తు రవి, సంయుక్త కార్యదర్శులుగా మంగలి సాయిలు, బెస్త నారాయణ, కటిక విజయ్, కమ్మరి సురేష్, గడ శంకర్, కుమ్మరి కిష్టయ్య, గంగి రమేష్ ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

విద్యుత్ శాఖ స్పెషల్ డ్రైవ్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో విద్యుత్ బిల్లుల వసూళ్ల కోసం సోమవారం విద్యుత్ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని గ్రేడ్ 2, గ్రేడ్ 3కి సంబంధించిన పెండింగ్ బిల్లుల వసూళ్లకు సంబందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మన్ శశికాంత్, సిద్దేంధర్ రెడ్డి తదితరులున్నారు.

గాజుల పండుగ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ గ్రామంలో సోమవారం మహిళలు గాజుల పండుగ నిర్వహించారు. ఒకరికొకరు గాజులు మార్చుకుంటూ సంబురాలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

జ్ఞానప్రకాశ్‌రెడ్డి సేవలు అభినందనీయం



భిక్కనూరు: దళితవాడలను అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తున్న కౌసల్య ఫౌండేషన్ చైర్మన్ జ్ఞానప్రకాశ్‌రెడ్డి సేవలు అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అన్నారు. భిక్కనూరులోని రెండు దళితవాడల్లో ఆయన పలు సౌకర్యాలు కల్పించడంతోపాటు నిధులను అందించారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కార్యాలయంలో సోమవారం జ్ఞానప్రకాశ్‌రెడ్డిని ఆయన సత్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాదిగ, తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు దివ్య మాట్లాడుతూ.. గర్భిణులు నిత్యం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌వో వెంకటరమణ, సిబ్బంది హరిత, సతీష్, వనశ్రీ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాము కలకలం



భిక్కనూరు: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్టుపై సోమవారం సుమారు మూడున్నర మీటర్ల పొడవున్న పాము కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పలువురు పామును పట్టుకోవడానికి యత్నించగా అరగంటపాటు చెట్టుపైనే అటు, ఇటు తిరుగుతూ స్థానిక చెట్లపొదల్లోకి వెళ్లిపోయింది.

బీఆర్ఎస్ సన్నాహక సమావేశం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో నిలబడే అభ్యర్థుల జాబితాపై చర్చించారు. మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, గ్రామ బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం

కామారెడ్డి అర్బన్: లింగంపేట మండలం పర్మల్ల గ్రామానికి చెందిన నారాయణ అనే వృద్దుడు డెంగీతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో అతడికి అత్యవసరంగా మూడు యూనిట్ల తెల్ల రక్తకణాలు అవసరం కాగా కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా రాకేష్, మణికంత, జగదీశ్వరచారీలు దానం చేసినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు సోమవారం తెలిపారు.

సంక్షిప్తం

శివాలయంలో ప్రత్యేక పూజలు



నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామంలోగల పంచముఖ శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రతి సోమవారం పంచముఖ లింగానికి అభిషేకాలు చేస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

నేడు సామూహిక నవదుర్గా వ్రతం

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోగల శారదామాత ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం 11గంటలకు సామూహిక శ్రీనవదుర్గ వ్రతం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పెంటయ్య తెలిపారు. భక్తులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో సోషల్ వర్క్ బోధించేందుకు రెండు అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈనెల 8వ తేదీ సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ కే విజయ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తులు అందజేసిన అభ్యర్థులకు 9వ తేదీన ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

8 వరకు ప్రవేశాలు పొందాలి

పీజీ ఎంట్రెన్స్ ద్వారా తొలి విడతగా కళాశాలలో వివిధ కోర్సుల్లో సీట్లు పొందిన వారు 8వ తేదీ వరకు కళాశాలలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ సూచించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలోని డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ సీసీ రమేష్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామసమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రతినెల పదో తేదీలోపు రుణాలు చెల్లించేలా తీర్మానాలు చేశారు. పాడి పశువులను పెంచేందుకు స్త్రీనిధి ద్వారా రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యంషాపును తొలగించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో కొనసాగుతున్న మద్యంషాపును తొలగించి, మరో చోట ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఉండటంతో మందుబాబులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాలనీవాసులు ఫరీద్, హన్మంత్‌రెడ్డి, బడిగె సాయిలు, లక్ష్మీకాంతం, మశ్చేందర్, వినోద్, సంగయ్య తదితరులున్నారు.